స్కెచ్

# పేరులోనే ఉంది!

"హితశ్రీ"

త్రువు తెచ్చిన ఆటబొమ్మవైపు గుడ్లప్పగించి తదేకదీక్షగా చూస్తున్న చిట్టిమేనల్లుణ్ణి చూసి 'వీడికేం పేరు పెడతావు బావా?' అనడిగాడు రాజయ్య.

'ఏదో పేరు. పేరులో ఏముంది? ఇంకా ఆలోచించలేదు.'

'పేరులో ఏముందేమిటి! అంతా పేరులోనే ఉంది. రాజయ్య అనే పేరు పెట్టటంవల్ల మీ బావమరిది గుండెలో ఈపాటికి తుపాకిగుండు దూరి ఉండాలిసింది.'

రాజయ్యవైపు అతని బావ సాశ్చర్యంగా చూచి 'ఎందుకు?' అన్నాడు.

'ఈమధ్య ఓ చిన్న తమాషా జరిగిందిలే. చెబుతా విను. మొన్నోరోజు తెల్లవారేటప్పటికి మా యింటిని పోలీసులు చుట్టుముట్టారు. వాళ్ళలో ఒకాయన సరాసరి నాదగ్గరికి వొచ్చి 'రాజయ్యగారు మీరేనా?' అన్నాడు. 'అవు'నన్నాను. అతను జేబులోంచి ఓ కాగితం తీసి నా ముఖందాకా వొచ్చేటు చెయ్యి సారించి 'వాన్ ఎక్కండి' అన్నాడు. నాకిదంతా అగమ్యగోచరంగా ఉంది. చేసేది లేక వాళ్లతో వాన్‌లో ఎక్కి కూర్చున్నాను.

'వాంటెడ్ కమ్యూనిస్టు రాజయ్య సార్.' అన్నాడు పోలీసాయన సూపరింటెండెంట్‌తో. నాకు ప్రాణాలు పైనే పోయాయి.

'పోలికలన్నీ సరిపోయాయా?' అన్నారు సూపరింటెండెంట్ గారు.

'సరిపోయాయి సార్, హైట్ మాత్రం ఇంకా చూడాలి.' అని ఆ పోలీసాయన నా హైట్ కొలిచాడు. అతని ముఖంలో కొంచెం ఆందోళన ద్యోతకమయింది. దొరగారు ప్రశ్నార్థకంగా చూశారు.

'ఒక్క అంగుళం ఎక్కువుంది సార్.'

'దాందేముంది. పెరిగి ఉండొచ్చు గద!' అన్నారు దొరగారు. పోలీసాయన ముఖం వికసించింది; 'దొరగారిది గట్టి బుర్రే,' అనుకున్నాడు కాబోలు, ఆయనవైపు ప్రశంసాపాత్రంగా చూశాడు.

నాకింతలో చటుక్కున ఓ ఉపాయం తోచింది. 'నేను కమ్యూనిస్టుని కాదు సార్,' అన్నాను.

'అలాగా!' అన్నట్టు నావైపు గేలిగా చూశారు దొరగారు.

'నిజం సార్. కావలిస్తే మీకు రుజువు చేయగలను'. చెప్పమన్నట్టు చూశాడాయన.

'నేను కాంగ్రెస్ సేవకుడినని మా ఎం. ఎల్. ఏ గారిచ్చిన సర్టిఫికెట్టు మీకు చూపించగలను.'

ఈ మాటతో దొరగారి ముఖం కొంచెం ముకుళించింది. 'ఏదీ?' అన్నాడాయన.

'ఇంట్లో ఉంది సార్. ఎవరినైనా కాన్‌స్టేబిల్‌ని పంపించి తెప్పించవచ్చు.'

దొరగారు పోలీసాయన వైపు చూశాడు. 'ఇవన్నీ దొంగెత్తులు సార్' అన్నాడతను.

ఇంతలో ఇంకా కొంతమంది పోలీసులు ఎవర్నో తీసుకొచ్చారు దొరగారి దగ్గరికి.

'వాంటెడ్ కమ్యూనిస్టు, రాజయ్య సార్.'

దొరగారితో సహా అంతా ఆశ్చర్యంగా చూశారు ఆ పోలీసులవైపు. ఆ వొచ్చినాయన ఇంచుమించు నాలాగే వున్నాడు ఆకారంలో. కాని నాకూ అతనికీ పోలికలు ముఖాల్లో ఏమీ లేవు.

దొరగారు నావైపు కాస్త నమ్మకంతో చూశారు. నేను బతుకు జీవుడా అనుకున్నాను.

'పోలికలన్నీ సరిపోయాయి సార్'

'నేను కమ్యూనిస్టుని కాదుసార్' అన్నాడు ఆ నిర్బంధితుడు.

'అలాగా' అన్నట్టు హేళనగా చూశాడు దొరగారు.

ఆ నిర్బంధితుడు జేబులోంచి ఓ చిన్న పేపరు కత్తిరింపు తీసి దొరగారి వైపు చేయి జాపి 'ఇది చదవండి సార్ తెలుస్తుంది' అన్నాడు. దొరగారు సబ్ ఇన్స్పెక్టర్ వైపు చూశాడు. అతను ఆ కాగితం తీసుకుని ఇలా చదివాడు.

'నా విరోధులు కొంతమంది నేను కమ్యూనిస్టునని ప్రచారం చేస్తున్నట్టు నాకు తెలియ వచ్చినది. ఇది కేవలము నాపై విద్రోహుల చర్య. నేను కమ్యూనిస్టును కానవియూ, ఆ పార్టీతో నా కెట్టి లావాదేవీలు లేవనియు ఈ పత్రిక ముఖతా తెలియ వచ్చెడ మయినది.

ఇట్లు

ఏ రాజయ్య.

దొరగారు కొంచెం కోపంగా చూశారు అతనివైపు.

'ఇవన్నీ దొంగెత్తులు సార్' అన్నాడు సబ్ ఇన్స్పెక్టర్.

'ఈ ప్రకటన సంవత్సరం ముందే వేయించాను - తమరలా అంటే నేనేం చెప్పను!' అని ప్రాధేయపడ్డాడు ఆకొత్త నిర్బంధితుడు.

'ప్రకటనలు వేయించటానికేం!'

'తమ రవకాశమిస్తే నేను కమ్యూనిస్టు కానని రుజువు చేసుకోగలను సార్. ఈమధ్య నేను నా పేరుకూడా మార్చుకున్నాను, ఇటువంటిదేదో సంభవించవచ్చునని. అది ఇవాళో, రేపో గవర్నమెంట్ గెజెట్లోకూడా పడుతుంది సార్. దీన్నిబట్టి అయినా నేను కమ్యూనిస్టుని కాదని తమరు గ్రహించాలి.'

అతనీమాటలు ముగించాడో లేదో ఇంకా కొంతమంది పోలీసులు మరో యువకుణ్ని అక్కడికి తీసుకొచ్చారు.

'వాంటెడ్ కమ్యూనిస్టు రాజయ్య, సార్.'

దొరగారు దిగ్భ్రాంతులైనారు. నాకు కూడా కొంచెం ఆశ్చర్యం వేసింది. అందరూ ఆ కొత్త యువకుడివైపు చూడసాగారు.

'నేను కమ్యూనిస్టుని కాను సార్.'

ఈసారి దొరగారు నవ్వలేదు. రుజువు చేసుకోమన్నట్టు అతనివైపు చూశారు.

'మీ వాంటెడ్ కమ్యూనిస్టు పేరు ఏ. రాజయ్య అని నాకు తెలుసు. పేపర్లో చదివాను.'

'అయితే ఏమి'టన్నట్టు చూశారు దొరగారు.

'నా పేరు బి. రాజయ్య అండి.'

సబ్ ఇన్స్పెక్టర్ నాలుక మడత వేసుకున్నాడు. 'అరె, ఒక్క అక్షరం తేడాతో పోయింది.' అనుకున్నట్టున్నాడు. దొరగారు ఇన్స్పెక్టర్ వైపు చూశారు. అతను గాభరా పడ్డాడు.

'ఈ ముగ్గుర్లో ఎవరో ఒకరు కమ్యూనిస్టయి ఉండాలి. అది తేలేదాకా వీళ్ళని నిర్బంధంలో ఉంచు' అని దొరగారు లేవబోయే టంతలో టెలిఫోన్ గంట గణగణ మోగింది. రిసీవర్ అందుకున్నాడు దొరగారు. క్షణంలో ఆయన ముఖాన నెత్తురుచుక్క లేకుండా పోయింది.

'ఏమిటీ! వాంటెడ్ కమ్యూనిస్టు-రాజయ్య! షాట్ డెడ్!' దొరగారి ముఖం క్వశ్చన్ మార్కు అయింది. ఆయన ముఖంలో ఏదో ప్రశాంతి కనుపించింది, మమ్మల్ని అనవసరంగా బాధించడం జరిగిందని కాబోలు. మా రాజయ్యలం ముగ్గురం మాత్రం 'బ్రతుకు జీవుడా' అనుకున్నాం.

సమయానికి ఆ కమ్యూనిస్టు రాజయ్య ఎవరో దొరకబట్టి నేను మళ్లీ ఇలా తిరగటం సంభవించింది! లేకపోతే ఆ జైలు గోడలమధ్య తార్లాడుతూ ఉండాలిసింది. చూశావా, పేరులో ఏముందన్నావు. అంతా పేరులోనే ఉంది. ఏమంటావు?'

'నిజమే.' నన్నాడు రాజయ్య బావ ఆలోచిస్తూ.

'మనవాడికి పృథ్విలో ఇంతవరకూ ఎవరూ పెట్టని పేరు ఆలోచించాలి. ఎందుకైనా మంచిది.'

మేనమామవైపు చూసి మేనల్లుడు పకా పకా నవ్వాడు, తనకంతా ఏమిటో అర్థమయినట్టు.